సాక్షి అనకాపల్లి

శనివారం। 16। డిసెంబర్। 2023



హోరాహోరీగా హాకీ పోటీలు

నక్కపల్లిలో అండర్ 19 విభాగంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు క్రీడాభిమానులను అలరిస్తున్నాయి. 8లో



ఆదర్శంగా పీఏసీఎస్

మునగపాక పీఏసీఎస్ శతవార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే కన్నబాబురాజు పాల్గొన్నారు. 8లో

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులు వాతావరణం పొడిగా ఉంటుందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉష్ణోగ్రతలు 28.8 నుంచి 29.2 డిగ్రీలు, గాలిలో తేమ 62-70 శాతం, గాలి గంటకు 6-8 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉందన్నారు.

న్యూస్‌రీల్

బీఎస్‌ఎన్‌ఎల్ వినియోగదారుల అవగాహన సదస్సు నేడు

అనకాపల్లి: భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్‌ఎన్‌ఎల్) వినియోగదారుల అవగాహన సదస్సును అనకాపల్లిలో శనివారం నిర్వహించనున్నట్లు సంస్థ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ (పీజీఎం) పాలకపాల్ విలియం శుక్రవారం తెలిపారు. 16న ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ సదస్సును రాజా థియేటర్ వెనుకనున్న న్యూ కాలనీలోని రోటరీ హాల్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీఎస్‌ఎన్‌ఎల్ సేవలపై అవగాహన కల్పించి సందేహాలను నివృత్తి చేస్తామన్నారు.

నూకాంబిక ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లి: గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయ పునఃనిర్మాణ పనులను వచ్చే ఏడాది కొత్తఅమావాస్యకు పూర్తి చేయాలని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. నూకాంబిక ఆలయ కమిటీ సభ్యులు మంత్రిని కలిసి.. అనువెట్టి మండపం, మూడు గాలి గోపురాలతో కూడిన ప్రాకార మండపాల ప్రారంభ కార్యక్రమానికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమం ఈ నెల 27న జరగనుందని తెలిపారు. మంత్రి మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డితో మాట్లాడి టీటీడీ వారు మంజూరు చేసిన రూ.కోటి 50 లక్షల నిధులు త్వరితంగా వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఏపీ ఇన్‌లాండ్ వాటర్‌వేస్ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి రాక నేడు

కోటకోట: తాళ్లపాలెం గ్రామ పంచాయతీకి కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిక శాఖ సహాయ మంత్రి ఎ.నారాయణస్వామి శనివారం మధ్యాహ్నం 2 గంటలకు వస్తున్నారని ఎంపీడీవో వి.వి. రవికుమార్ తెలిపారు. పంచాయతీ కార్యాలయం వద్ద జరగనున్న వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో ఆయన పాల్గొంటారన్నారు. పర్యటన ఏర్పాట్లను జేసీ జాహ్నవి పరిశీలించారు.


25లోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



శాంతిపార్కు పనులను పరిశీలిస్తున్న సాయికాంత్‌వర్మ

అనకాపల్లి: జీవీఎంసీ పరిధిలో జోన్లవారీగా అభివృద్ధికి ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు విడుదల చేసిందని, పలు ప్రాంతాల్లో పనులు జరుగుతున్నాయని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మ అన్నారు. అనకాపల్లి జోన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం జోనల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు జరుగుతున్న ప్రదేశాల్లో క్షేత్రస్థాయి సిబ్బంది నిరంతర పర్యవేక్షణ జరపాలన్నారు. మెయిన్‌రోడ్డు రహదారిలో డివైడర్ పనులు జరుగుతున్న సమయంలో ప్రజలకు ఇబ్బందుల్లేకుండా, నాణ్యతలో రాజీపడకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. పనులన్నీ డిసెంబర్ 25లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్సీ సుర వెంకటరమణ, జీవీఎంసీ ఇంజినీర్లు రామ్మోహనరావు, కృష్ణారావు, రాయల్‌బాబు, హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ ఎం.దామోదరరావు, ఏసీపీ ఝాన్సీలక్ష్మి, డీఈ చిరంజీవి, టీపీఎస్ జనార్దనరావు పాల్గొన్నారు.

తాండవ సుగర్స్ ఎండీగా ప్రసాదరావు



పాయకరావుపేట: తాండవ చక్కెర కర్మాగారం ఎండీగా పి.ప్రసాదరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. చోడవరం సుగర్ ఫ్యాక్టరీలో ప్రసాదరావు చీఫ్ ఇంజనీర్‌గా పనిచేసేవారు. ప్రస్తుతం తాండవ చక్కెర కర్మాగారం ఎండీగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇన్‌చార్జ్ ఎండీగా భీమసింగి సుగర్స్ ఎండీ విక్టర్ రాజు విధులు నిర్వహించారు.

• దేదీప్యమానం



చోడవరం స్వయంభూ గౌరీశ్వరాలయం దీప కాంతులతో కళకళలాడింది. పవిత్ర కార్తీక మాసం, మార్గశిరమాసం విశిష్టతను ప్రతిబింబిస్తూ ఆలయ ప్రాంగణంలో 40 వేల జ్యోతులతో దీపోత్సవం నిర్వహించారు. వివిధ ఆకారాలలో దీపాలను అమర్చి వెలిగించారు. 8లో





కనకమ్మా.. వందనం

మార్గశిరమాసం తొలి శుక్రవారం రోజున మహిళలు బోనాలు, సారె సమర్పణతో అమ్మవారిని పూజించారు. యలమంచిలి పట్టణం ధర్మవరంలో ఉన్న కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి మంగళవాద్యాల నడుమ బోనాలతో తరలివెళ్లారు. అక్కడ ప్రత్యేకంగా హారతులు ఇచ్చి అమ్మవారికి అభిషేకాలు చేశారు. పసుపు, కుంకుమలు సమర్పించారు. 8లో



మెట్రో.. లైట్ లైట్...!





మెట్రో రైల్ ప్రాజెక్టు నమూనా

- లైట్ మెట్రో డీపీఆర్‌కు కేబినెట్ ఆమోదముద్ర
- 76.90 కి.మీ. లైట్ మెట్రో నిర్మాణానికి ప్రణాళికలు
- తొలివిడతలో 46.23 కిమీ 42 మెట్రో స్టేషన్లతో కూడిన 3 కారిడార్ల నిర్మాణం
- ఫస్ట్ ఫేజ్ నిర్మాణానికి రూ.9,699 కోట్ల అంచనా వ్యయం
- ఫేజ్-2లో రూ.4,610 కోట్లతో 12 స్టేషన్లతో కారిడార్-4 నిర్మాణం
- పనులు దక్కించుకున్న మూడేళ్లలోనే తొలి రైలు పరుగు
- అనంతరం మోడ్రన్ ట్రామ్ ప్రాజెక్టుకు శ్రీకారం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

ప్రథమ శ్రేణి నగరాలతో పోటీపడుతూ మహా విశాఖ మరింత అభివృద్ధి చెందేందుకు అవసరమైన మెట్రో రైలు ప్రాజెక్టుకు రాష్ట్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రజారవాణా వ్యవస్థను పటిష్టం చేసేలా రూపొందించిన లైట్ మెట్రో రైలు ప్రాజెక్టు



పూర్తిస్థాయి ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)కు ఆమోదం తెలిపింది. మొత్తంగా రూ.14,309 కోట్లతో 76.90 కిమీ మేర లైట్‌మెట్రో నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందులో తొలి విడతలో రూ.9,699 కోట్లతో 46.23 కిమీ, ఫేజ్-2లో రూ.4,610 కోట్లతో నాలుగో కారిడార్ నిర్మాణ పనులు నిర్వహించేందుకు కేబినెట్ ఆమోదించింది. ఈ పనులకు సమాంతరంగా మోడ్రన్ ట్రామ్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించిన డీపీఆర్‌కు ఇంకా ఆమోదం తెలపాల్సి ఉంది. లైట్ మెట్రో డీపీఆర్‌ను కేంద్ర ప్రభుత్వానికి పంపించే ఏర్పాట్లలో ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ అధికారులు నిమగ్నమయ్యారు.

కారిడార్	కారిడార్ సెక్షన్	పొడవు (కిమీలలో)	స్టేషన్లు
1	స్టీల్‌ప్లాంట్ గేట్-కొమ్మాది జంక్షన్	34.40	29
2	గురుద్వార నుంచి పాతపోస్టాఫీస్	5.07	06
3	తాటిచెట్లపాలెం నుంచి చినవాల్తేరు	6.75	07
4	కొమ్మాది నుంచి భోగాపురం ఎయిర్‌పోర్టు	30.67	12

నగర అవసరాలకు అనుగుణంగా..

2021 అంచనాల ప్రకారం విశాఖ మహా నగరంలో 25 లక్షలకు పైగా జనం ఉన్నారు. మెట్రో ప్రపోజల్స్ ఉన్న శివారు ప్రాంతాల్లో కలిపి 41 లక్షల వరకూ జనాభా ఉంటారు. అందుకే తప్పనిసరిగా మెట్రో అవసరం. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. లాభనష్టాలతో సంబంధం లేకుండా కేవలం ప్రజలకు రవాణా సౌకర్యాలు భవిష్యత్తులో మెరుగుపరిచేందుకు మెట్రోపై దృష్టిసారించింది. మెట్రో రైలు రాకతో ట్రాఫిక్ సమస్య తీరడంతో పాటు సమయం కూడా ఆదా అవుతుంది. ఒక మెట్రో రైలు 8 బస్సులతో సమానం. ఒకసారి వెళ్లే మెట్రోలో 400 మంది ప్రయాణించగలరు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన కేబినెట్ సమావేశంలో లైట్‌మెట్రో ప్రాజెక్టు డీపీఆర్‌కు ఆమోదం తెలిపారు. 76.90 కిమీ మేర లైట్‌మెట్రో ప్రాజెక్టు పట్టాలెక్కనుంది. హెవీ మెట్రోతో పోల్చి చూస్తే లైట్ మెట్రో ద్వారా నిర్మాణ వ్యయంలో 20 శాతం, వార్షిక నిర్వహణలో 15 శాతం భారం తగ్గనున్న కారణంగా రాష్ట్ర ప్రభుత్వం లైట్ మెట్రోవైపే మొగ్గు చూపింది.

ఎనిమిదేళ్లలో పూర్తి

పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో విశాఖ మెట్రో ప్రాజెక్టు నిర్మించాలని కేబినెట్ నిర్ణయించింది. మొత్తం ప్రాజెక్టు విలువ రూ.14,309 కోట్లు అవుతుందని డీపీఆర్‌లో పొందుపరిచారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం 20 శాతం అంటే రూ.2861.8 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం 20 శాతం అంటే రూ.2861.8 కోట్లు వెచ్చించనున్నాయి. మిగిలిన మొత్తం రూ.8585.4 కోట్లను బిడ్డింగ్ దక్కించుకున్న ప్రైవేట్ సంస్థ పెట్టుబడి పెట్టి పనులు ప్రారంభించనుంది.

మొత్తంగా టెండర్లు దక్కించుకున్న సంస్థ ఎనిమిదేళ్లలో ప్రాజెక్టును పూర్తి చేయాల్సి ఉంటుంది. కానీ ప్రాజెక్టు దక్కించుకున్న మూడేళ్లకే తొలి మార్గంలో ప్రయాణికులకు మెట్రో సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంటుంది. సదరు నిర్మాణ సంస్థ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓ అండ్ ఎం) ద్వారా 30 ఏళ్ల పాటు నిర్వహించాల్సి ఉంటుంది. ఈ 30 ఏళ్ల పాటు ప్రాజెక్టు నుంచి వచ్చే ఆదాయాన్ని సదరు సంస్థ ఆర్జిస్తుంది. లైట్ మెట్రో పనులు తుదిదశకు వచ్చిన తర్వాత మోడ్రన్ ట్రామ్ కారిడార్‌పై దృష్టిసారించనున్నారు.

మొదటి దశలో 46.23 కి.మీ.

42 మెట్రో స్టేషన్లతో కూడిన మూడు కారిడార్లను మొదటి దశలో నిర్మించాలని భావిస్తున్నారు. కారిడార్-1లో స్టీల్‌ప్లాంట్ గేట్ నుంచి కొమ్మాది జంక్షన్ వరకు 29 స్టేషన్లతో 34.40 కిమీ, కారిడార్-2లో 5.07 కిమీ మేర 6 మెట్రో స్టేషన్లతో గురుద్వార నుంచి పాత పోస్టాఫీస్ వరకూ, కారిడార్-3లో భాగంగా 7 స్టేషన్లతో తాటిచెట్లపాలెం నుంచి చినవాల్తేరు వరకూ 6.75 కిమీ మేర లైట్‌మెట్రో కారిడార్ పూర్తి చేయాలని భావిస్తున్నారు. ఇందులో మొట్టమొదటిగా స్టీల్‌ప్లాంట్ నుంచి ఎన్ఏడీ జంక్షన్ వరకూ లైట్‌మెట్రో ట్రాక్ పనులు ప్రారంభం కానున్నాయి. ఈ కారిడార్ పనులను మూడేళ్లలోపు పూర్తి చేసి మొదటి రైలు నడిపేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అనంతరం కారిడార్-4లో కొమ్మాది నుంచి భోగాపురం ఎయిర్‌పోర్టు వరకూ 30.67 కిమీ మేర నిర్మాణం చేయనున్నారు. ఇందులో 12 స్టేషన్లు రాబోతున్నాయి. మొత్తంగా నాలుగు కారిడార్లలో 54 స్టేషన్లు, రెండు డిపోలు ఏర్పాటు చేయనున్నారు.

వచ్చే వారం కేంద్రానికి డీపీఆర్



వైజాగ్ మెట్రో ప్రాజెక్టు నిర్మాణంలో తొలి అడుగు పడింది. కేబినెట్ డీపీఆర్‌ను ఆమోదించడం శుభపరిణామం. లైట్ మెట్రో ప్రాజెక్టుకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు నాలుగైదురోజుల్లో విడుదలవుతాయి. అనంతరం ఆ జీవో కాపీని జతపరుస్తూ కేంద్ర ప్రభుత్వానికి డీపీఆర్ సమర్పిస్తాం. వీలైనంత త్వరగా ప్రాజెక్టును ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష. దానికనుగుణంగా అడుగులు పడుతున్నాయి. వ్యత్యాస నిధి (వయబిలిటీ గ్యాప్ ఫండ్) తగ్గిస్తూ... ఎవరైతే బిడ్డింగ్ దాఖలు చేస్తారో వారే వైజాగ్ మెట్రో పనులు దక్కించుకుంటారు. ఏపీ ఎగ్జిక్యూటివ్, ఫైనాన్షియల్ క్యాపిటల్‌గా, ఐటీ హబ్‌గా అభివృద్ధి చెందుతున్న విశాఖ నగరం విస్తరిస్తున్న నేపథ్యంలో శివారు ప్రాంతాలు కూడా కోర్ సిటీకి సమానంగా అభివృద్ధి చెందాలంటే మౌలిక సదుపాయాలు అవసరం. రాబోయే 35-40 ఏళ్లలో నగర ట్రాఫిక్ డిమాండ్‌కి అనుగుణంగా డీపీఆర్ సిద్ధం చేశాం.

– యూజేఎం రావు, ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ ఎండీ

ఇదీ మెట్రో రైలు స్వరూపం..

లైట్ మెట్రో ప్రాజెక్టు మొత్తం అంచనా వ్యయం
రూ. 14,309 కోట్లు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా
రూ. 5723.6 కోట్లు

ప్రైవేట్ నిర్మాణ సంస్థ వాటా
రూ. 8585.4 కోట్లు

తొలి రైలు తిరిగే సమయం
పనులు ప్రారంభించిన 3 ఏళ్లలోపు

ప్రాజెక్టు పూర్తి చేసేందుకు సమయం
8 ఏళ్లు

ఫేజ్-1లో కారిడార్-1,2,3 నిర్మాణానికి అంచనా వ్యయం
రూ. 9,699 కోట్లు

ఫేజ్-2లో కారిడార్-4 నిర్మాణానికి అంచనా వ్యయం
రూ. 4,610 కోట్లు

ప్రాజెక్టు విస్తీర్ణం
76.90 కిమీ,
54 స్టేషన్లు

బాధితులకు 346 మొబైళ్లు అప్పగింత

మొబైల్ రికవరీ మేళాలో ఎస్పీ మురళీకృష్ణ



బాధితులకు మొబైళ్లు అందిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

తుమ్మపాల: బాధితులకు రూ.68 లక్షల విలువ గల 346 మొబైళ్లు అందించినట్లు ఎస్పీ కె.వి. మురళీకృష్ణ తెలిపారు. జిల్లా పోలీస్ సూపరిండెంటెంట్ కార్యాలయంలో శుక్రవారం మొబైల్ రికవరీ మేళా నిర్వహించి బాధితులకు మొబైల్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 2,100 ఫిర్యాదులు నమోదు కాగా, ఐదు విడతల్లో 1,238 మొబైళ్లను వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి రికవరీ చేసి బాధితులకు అందజేశామన్నారు. వీటి విలువ రూ.2.20 కోట్లు ఉంటుందన్నారు. రాష్ట్రంలో వారితోపాటు తెలంగాణ, కేరళ రాష్ట్రాల బాధితుల ఫోన్లను రికవరీ చేసి ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నవారు సీఈఐఆర్(డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఈఐఆర్.జీఓవీ.ఐఎన్) వెబ్‌సైట్‌లో వివరాలను సమర్పించాలన్నారు. జిల్లా పరిధిలో వాట్సాప్ నంబరు 9505200100కు హాయ్ అని టైప్ చేయడం ద్వారా (ఏకేపీఎంటీబీఐఎల్ఈటీఆర్ఏసీకేఈఆర్.ఐఎన్) లింక్ వస్తుందన్నారు. దాన్ని ఓపెన్ చేసి పోగొట్టుకున్న మొబైల్ వివరాలు పొందుపరిస్తే, ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామన్నారు. మొబైల్ మిస్సింగ్ గురించి ప్రజలు పోలీసు స్టేషన్లకు వెళ్లడం అసౌకర్యంగా ఉందని ఫీడ్ బ్యాక్ రావడంతో ఈ సౌకర్యం కల్పించామన్నారు. పోగొట్టుకున్న మొబైల్స్‌ను ట్రేస్ చేస్తూ ఐటీ కోర్ సిబ్బంది ఎల్లప్పుడు మంచి సేవలు అందిస్తున్నారన్నారు. మొబైల్ మిస్సింగ్ కేసులలో త్వరితగతిన రికవరీ అవుతున్నందు వల్ల ప్రజలు మరింత నమ్మకంతో ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు బి. విజయభాస్కర్, పి.సత్యనారాయణరావు, ఇన్‌స్పెక్టర్లు చంద్రశేఖర్, అప్పలనాయుడు, ఐటీ కోర్ ఎస్సై రఘువర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు పనుల్లో నాణ్యత పరిశీలన

గొలుగొండ: నర్సీపట్నం-కృష్ణదేవిపేట మార్గంలో అరిల్లోవ అటవీ ప్రాంతంలో జరుగుతున్న రోడ్డు పనులను ఆర్అండ్‌బీ క్వాలిటీ డీఈఈ సత్యప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. సుమారు 3.5 కిలోమీటర్ల దూరం మేర రూ.6 కోట్లతో రోడ్డు పనులు జరుగుతున్న నేపథ్యంలో నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు పనులు నాణ్యంగా, వేగంగా జరిగే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. జేఈఈ ప్రసాద్, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు తదితర్లు పాల్గొన్నారు.



ఉత్తరాంధ్ర అభివృద్ధిని ప్రజలకు వివరిస్తాం

- నేటి నుంచి మూడు రోజుల పాటు పర్యటన
- ఈ నెల 16న భోగాపురం ఎయిర్‌పోర్టును పరిశీలిస్తాం
- మీడియాతో వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఉత్తరాంధ్రలో అభివృద్ధిని ప్రజలకు వివరిస్తామని పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. మూడు రోజుల పాటు ఉత్తరాంధ్రలో పార్టీ ముఖ్యనేతలు, మంత్రులు పర్యటించి ప్రజలకు వివరిస్తామన్నారు. ఈ నెల 16న భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టును, 17న విజయనగరం మెడికల్ కళాశాల, 18న మూలపేట పోర్టు పనులను పరిశీలించి ప్రజలకు వివరించే వినూత్న కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. శుక్రవారం ఎండాడ లా కాలేజ్ సమీపంలో ఉన్న పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలను సమానంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే ఉత్తరాంధ్రలో పెద్దఎత్తున అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు హామీలే తప్ప వాటిని నెరవేర్చిన పాపాన పోలేదన్నారు. ఉత్తరాంధ్రలో ప్రాజెక్టులు శంకుస్థాపనలకే పరిమితమయ్యాయన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఉద్దానం సమస్యకు శాశ్వత పరిష్కారం సీఎం వైఎస్ జగన్ చూపించారన్నారు. ప్రజాసంకల్పయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం హామీ నెరవేర్చారన్నారు. ఉద్దానంలో రూ. 750 కోట్లతో వైఎస్సార్ సుజల ధార ప్రాజెక్టు, రూ.85 కోట్లతో వైఎస్సార్ కిడ్నీ రీసెర్చ్ అండ్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభించారన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌లో 14 అర్జీలు



పోలీస్ సిబ్బంది సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి: స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం పోలీసులకు గ్రీవెన్స్ కార్యక్రమం జరిగింది. జిల్లాలో 14 మంది పోలీసు సిబ్బంది హాజరై వారి వారి వ్యక్తిగత సమస్యలు ఎస్పీ కె.వి. మురళీకృష్ణకు విన్నవించుకున్నారు. అదనపు ఎస్పీ (పరిపాలన) బి.విజయభాస్కర్ పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా తయారీ

- కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి
- నర్సీపట్నంలో ఎన్నికల కమిషన్ అధికారుల పర్యటన



ఎన్నికల కమిషన్ అధికారులతో కలిసి మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల/నర్సీపట్నం: జిల్లాలో స్వచ్ఛమైన పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపొందిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో భారత ఎన్నికల కమిషన్ అధికారులు అరవింద్ ఆనంద్, లవకుశ్ యాదవ్‌లతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కమిషన్ అధికారులు జిల్లా ఓటర్ల జాబితా-2024 ప్రత్యేక సవరణ తీరును పరిశీలించారన్నారు. ఓటర్ల చేర్పులు, మార్పులు, తొలగింపులు చేసేందుకు చేపట్టిన చర్యలు, సంబంధిత దరఖాస్తుల పంపిణీ వంటి అంశాలను పరిశీలించి తీసుకున్న చర్యలు గురించి చర్చించారన్నారు. స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపొందించేందుకు ఎన్నికల కమిషన్ కఠినమైన నియమ నిబంధనలు ఏర్పాటు చేసిందన్నారు. ఓట్ల తొలగింపునకు కచ్చితమైన విచారణ చేయాలన్నారు. కమిషన్ ప్రతినిధులు తెలిపిన విధంగా ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతుందన్నారు. అనంతరం భారత ఎన్నికల కమిషన్ అధికారులతో కలిసి నర్సీపట్నంలో పర్యటించారు. జేసీ జాహ్నవి, ఆర్డీవో జయరాం పాల్గొన్నారు.

త్యాగమూర్తులకు నివాళి


పొట్టి శ్రీరాములు, పటేల్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి/తుమ్మపాల: జీవితాన్ని పణంగా పెట్టి రాష్ట్రానికి, దేశానికి అమూల్యమైన సేవలందించిన అమరజీవి పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ అన్నారు. ఆ మహనీయుల వర్ధంతిని పురస్కరించుకొని పోలీసు కార్యాలయంలో వారి చిత్రపటాలకు శుక్రవారం ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాషాప్రయుక్త రాష్ట్రాల సాధన కోసం ఆమరణ దీక్ష చేపట్టి, ప్రాణాలను అర్పించిన మహనీయుడు పొట్టి శ్రీరాములన్నారు. పటేల్ స్వాతంత్ర్య సంగ్రామంలో గాంధీ వెంట నడిచి, సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని, జైలుశిక్ష అనుభవించారని చెప్పారు. వారి ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. జిల్లా అదనపు ఎస్పీ బి.విజయ్‌భాస్కర్, క్రైం ఎస్పీ పి.సత్యనారాయణరావు, ఇన్‌స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, చంద్రశేఖర్, అప్పలనాయుడు, పైడపు నాయుడు, ఎస్‌ఐ వెంకన్న, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఏర్పడటానికి మూలకారకులు పొట్టి శ్రీరాములని, అంటరానితనం నివారణకు ఎన్నో ఉద్యమాలు చేశారన్నారు. బీసీ సంక్షేమ శాఖ డీడీ కె.రాజేశ్వరి, ఏబీసీడబ్ల్యూఓ సంఘం అధ్యక్షుడు ఎస్.సత్యనారాయణ, సహాయ సంక్షేమ అధికారులు జి.నాగేశ్వరరావు, ఎం.నరసింహులు, వి.గోపినాథరావు పాల్గొన్నారు.

టీడీపీలో అయ్యన్నపాత్రుడిది కమెడియన్ పాత్ర

రాష్ట్రకాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం


నక్కపల్లిలో విలేకర్లతోమాట్లాడుతున్న వీసం రామకృష్ణ

నక్కపల్లి: తెలుగు దేశంపార్టీలో అయ్యన్న పాత్రుడిది తాగుబోతు కమెడియన్ పాత్ర అని, లోకేష్, చంద్రబాబు సభలకు వచ్చిన జనం వెళ్లిపోకుండా కొద్దిసేపు నవ్వుకునేలా జోకర్ వేషాలు వేయిస్తున్నారని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్, ఏపీ ఎఫ్‌యూఐడీసీ డైరెక్టర్ వీసం రామృష్ణ ఎద్దేవా చేశారు. శుక్రవారం ఆయన నక్కపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల నక్కపల్లిలో లోకేష్ నిర్వహించిన యువగళం బీసీ సదస్సులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించిన తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పట్టాదారు పాసుపుస్తకాలు, సంక్షేమపథకాలపై సీఎం జగన్ ఫొటో వేయించుకోవడంపై అయ్యన్న చేసిన వ్యాఖ్యలను ఖండించారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు హెల్త్‌కార్డులు, చంద్రన్నబీమా, చంద్రన్నకానుకపైన చంద్రబాబు ఫొటోలు వేయించుకున్నారని, అన్న క్యాంటిన్‌లపై ఎన్టీఆర్ ఫొటో వేశారని, పలు పథకాలను చంద్రబాబు పేరుపెట్టి అమలు చేశారని ఎవడి బాబు సొమ్ము ఇస్తున్నట్టు చంద్రబాబు, ఎన్టీఆర్ ఫొటోలు పెట్టుకునే వారని నిలదీశారు. టీడీపీలోను, సొంత ఇంట్లోను అయ్యన్న పాత్రుడికి ప్రాధాన్యత రోజు రోజుకు తగ్గిపోతోందన్నారు. జిల్లాలో గంటాదే పైచేయిగా ఉందన్నారు. చంద్రబాబు, లోకేష్‌లు అయ్యన్నపాత్రుడిని జోకర్‌గా పార్టీకోసం వాడుకుంటున్నారన్నారు. అయ్యన్నను రాజకీయంగా సమాధి చేసే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని తెలిపారు. జగన్‌ను తిట్టయినా సరే కొడుకుకు ఎంపీ టిక్కెట్ సంపాదించుకోవాలన్న నీచపు ఆలోచనతో అయ్యన్న దిగజారి మాట్లాడుతున్నారని విమర్శించారు. జగన్‌పైనోరు పారేసుకుంటే నియోజకవర్గ ప్రజలే గుణపాఠం చెబుతారని తెలిపారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ వీసం నానాజీ, సర్పంచ్‌లు సాదిరెడ్డి శ్రీను, సురేష్ వర్మ, తళ్ల భార్గవ్, అల్లు రమణ, పార్టీసీనియర్ నాయకులు మనబాల తాతారావు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రకే ఆదర్శంగా మునగపాక పీఏసీఎస్

- ఘనంగా శతవసంతాల వార్షికోత్సవం
- సహకార జెండా,శిలాఫలకం ఆవిష్కరించిన ఎంపీ డాక్టర్ సత్యవతి, ఎమ్మెల్యే రమణమూర్తిరాజు
- వ్యవసాయ రంగానికి సీఎం జగన్ పెద్దపీట


శతవసంతాల వేడుకలకు హాజరైన రైతులు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక: స్థానిక పీఏసీఎస్ అన్నదాతలకు విశేష సేవలందిస్తూ ఉత్తరాంధ్రకే ఆదర్శంగా నిలిచిందని అనకాపల్లి ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకటసత్యవతి, ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు అన్నారు. ఈ పీఏసీఎస్ ఏర్పాటై వంద సంవత్సరాల పూర్తయిన సందర్భంగా సంఘ అధ్యక్షుడు కోనపల్లి రామ్మోహనరావు అధ్యక్షతన శత వసంతాల వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సంఘం కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వేడుకల్లో పలువురు ప్రజా ప్రతినిధులు, రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా సహకార సంఘం జెండాను అనకాపల్లి ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి, ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు ఆవిష్కరించారు. సంఘం కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించి, జ్యోతి ప్ర జ్వలనతో వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ సత్యవతి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయరంగానికి పెద్దపీట వేస్తున్నారని, రైతు పక్షపాతిగా సేవలందిస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే రమణమూర్తిరాజు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలోనే మునగపాక పీఏసీఎస్ లాభాల బాటలో పయనిస్తూ రైతులకు మెరుగైన సేవలందిస్తోందన్నారు. వందేళ్ల క్రితం స్థాపించిన సొసైటీ అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. ఇటీవల సంభవించిన తుపానులో పంట నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం పరిహారం అందిస్తుందని తెలిపారు. డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు మాట్లాడుతూ రైతులకు మెరుగైన సేవలందిస్తూ ఉత్తరాంధ్రలోనే మునగపాక సొసైటీ గుర్తింపు పొందిందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ మునగపాక మండలంలోని మూడు సొసైటీలు లాభాల బాటలో పయనిస్తున్నాయంటే రైతుల సహకారమే కారణమని తెలిపారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ మాట్లాడుతూ మునగపాక పీఏసీఎస్ ద్వారా రైతులకు మెరుగైన సేవలందించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర సహకార బ్యాంక్ ఎండీ శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ సొసైటీ ద్వారా మరిన్ని సేవలందించేందుకు రాష్ట్ర సహకార శాఖ ద్వారా రూ.8 లక్షలు సాయంగా అందజేస్తామన్నారు. సభాధ్యక్షుడు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి రైతుల సహ కారం తీసుకుంటూ ఆదర్శ సొసైటీగా మరింత గుర్తింపు వచ్చేందుకు కృషి చేస్తానన్నారు. డీసీసీబీ సీఈవో వర్మ,వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఆడారి అచ్చియ్యనాయు డు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి,జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ,'సర్పంచ్ దిమ్మల అప్పారావు, స్థానిక ఎంపీటీసీలు సూరిశెట్టి రాము, బొడకుర్తి గణేష్ పాల్గొన్నారు. అనంత రం ఇంతవరకు సొసైటీ అధ్యక్షులు, కార్యదర్శులుగా సేవలందించిన వారి కుటుంబాలను సత్కరించారు.

అమ్మవారికి ఘనంగా బోనాల సమర్పణ


తొలి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు

యలమంచిలి రూరల్: మార్గశిర మాసం తొలి శుక్రవారం నాడు వందలాది మంది మహిళా భక్తులు అమ్మవారికి ఘనంగా బోనాలు, సారె సమర్పించారు. పట్టణ వీధుల్లో బోనాలు, సారెను మంగళవాద్యాల నడుమ ఊరేగించి, అమ్మవారి ఆలయానికి వెళ్లారు. అక్కడ ప్రత్యేక హారతులు, అమ్మవారికి అభిషేకాలు, పసుపు,కుంకుమలు సమర్పించారు. బోనాల్లో ఉన్న నైవేద్యాలను అమ్మవారికి సమర్పించారు. బోనాల ఊరేగింపు సందర్భంగా మహిళలు,బాలికలు కోలాటమాడారు.ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పలువురు మహిళలు అమ్మవారికి చీర,గాజులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ ప్రతినిధులు కొఠారు సాంబ,మడుగుల సత్యనారాయణ,తాటిపాకల చిన్ని,కొఠారు ఈశ్వరరావు,కొఠారు శ్రీను,మజ్జి కనక,కొసిరెడ్డి నాగు,తాటికళ్ల జోగినాయుడు పర్యవేక్షించారు.


మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

గోవాడ సుగర్స్‌లో క్రషింగ్ ప్రారంభం


గోవాడ సుగర్స్‌లో కేన్ క్యారియర్ వద్ద చెరకు గెడలు వేసి క్రషింగ్ ప్రారంభిస్తున్న ఎండీ సన్యాసినాయుడు, సిబ్బంది

- ఈ ఏడాది 2 లక్షల టన్నుల గానుగాట లక్ష్యం
- టన్ను చెరకుకు రూ.2,920 మద్దతు ధర
- గోవాడ ఎండీ సన్యాసినాయుడు

చోడవరం: గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో క్రషింగ్ లాంఛనంగా ప్రారంభమైంది. ఫ్యాక్టరీ కేన్ క్యారీయర్ వద్ద ఎండీ వి. సన్యాసినాయుడు, యాజమాన్య అధికారులు, కార్మికులు కలిసి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. కేన్ క్యారీయర్‌లో చెరకు గెడల కట్టలు వేసి క్రషింగ్ ప్రారంభించారు. అనంతరం ఎండీ మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి 22 మధ్యలో రెగ్యులర్ క్రషింగ్ చేపడతామన్నారు. ఈ ఏడాది 9.5 శాతం రికవరీ వస్తే టన్నుకు రూ.2,920 చొప్పున ఇస్తామన్నారు. ఈ సీజన్‌లో రెండు లక్షల టన్నుల చెరకు గానుగాట చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఫ్యాక్టరీ పరిధితోపాటు తాండవ, ఏటికొప్పాక ఫ్యాక్టరీల పరిధిలో చెరకును గానుగాట చేయాలని నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ అడ్మినిస్ట్రేటివ్ అధికారులు, గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు కేవీవీ భాస్కరరావు, కార్మిక సంఘం నాయకుడు శరగడం రామునాయుడు పాల్గొన్నారు.

నిరాశ చెందిన తెలుగు తమ్ముళ్లు

రాంబిల్లి: హరిపురం వద్ద టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్.టి.రామారావు విగ్రహానికి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ పూలమాల వేయకపోవడంతో పార్టీ కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేశారు. పాదయాత్ర చేస్తున్న యలమంచిలి-గాజువాక బైపాస్ రోడ్డును ఆనుకొని ఎన్టీఆర్ విగ్రహం ఉండటంతో లోకేష్ పూలమాల వేస్తారని అంతా ఆశించారు. స్థానిక నాయకులు చెప్పినా లోకేష్ పూలమాల వేయకుండానే ముందుకు సాగారు. పంచదార్ల వద్ద ఏర్పాటు చేసిన బసలోకి కొత్తపట్నానికి చెందిన నాయకులను అనుమతించకపోవడంపై ఆయా గ్రామ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ముందుగా పేర్లు నమోదు చేసుకున్న వారికే లోపలకు ఎంట్రీ అని అక్కడున్న వాళ్లు తమను అడుకున్నారని ఆయా గ్రామ నాయకులు గుసగుసలాడుకున్నారు. పాదయాత్రలో జనసేన నేతల హవా కనిపించింది. తమ నాయకుడికే సీటు అంటూ తెలుగు తమ్ముళ్లు.. లేదు తమ నాయకుడికే సీటు అంటూ జనసేన కార్యకర్తలు చర్చించుకోవడం కొసమెరుపు.

సమగ్ర అభియాన్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


డీఈవో వెంకటలక్ష్మమ్మకు వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

అనకాపల్లి: సమగ్ర అభియాన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం నుంచి పెడ్ డౌన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ పట్టణ అధ్యక్షుడు ఎస్.శంకరరావు తెలిపారు. కొత్తూరు డీఈవో కార్యాలయంలో డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మకు ఫెడరేషన్ అధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రం అందజేసినట్టు చెప్పారు.ఈ కార్యక్రమంలో ఉద్యోగులు వెంకటేష్, లోవరాజు, లోకేష్ పాల్గొన్నారు.

భూహక్కు పట్టాలతో సర్వహక్కులు

ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్


లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తున్న ఎమ్మెలే గణేష్

నర్సీపట్నం: జగనన్న సంపూర్ణ భూహక్కు పట్టాలతో ప్రభుత్వం సర్వహక్కులు కల్పించిందని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన జగనన్న దళిత సంపూర్ణ భూహక్కు పట్టాల పంపిణీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి భూమిని కొనుగోలు చేసి దళితులకు పంచారన్నారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సంపూర్ణ భూహక్కు పథకం కింద శాశ్వత భూహక్కు పట్టాలను పంపిణీ చేస్తున్నారన్నారు. నాతవరం మండలం సమ్మచింత గ్రామంలో 53 మంది దళితులకు హక్కు పట్టాలు పంపిణీ చేశామన్నారు. మంచి చేస్తున్న ప్రభుత్వానికి అందరి ఆశీస్సులు అందించాలన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కె.రామారావు మాట్లాడుతూ నాతవరం, బుచ్చెయ్యపేట మండలాల్లో 61 మంది లబ్ధిదారులకు రాజశేఖర్‌రెడ్డి హయాంలో 37.5 ఎకరాల భూమిని కొనుగోలు చేసి పంపిణీ చేశామన్నారు. ఒక్కొక్క లబ్ధిదారునికి 67 సెంట్లు ఇచ్చామన్నారు. ప్రభుత్వ సబ్సిడీ శాతం, లబ్ధిదారుడు వాటా 25 శాతం నిర్ణయించామన్నారు. ఎస్సీ కార్పొరేషన్‌లో రూ.లక్షలోపు రుణాలు మాఫీ చేశామన్నారు. వీరి పేరు మీద రుణం లేకపోవడంతో జగనన్న దళిత సంపూర్ణ భూహక్కు పథకం కింద పట్టాలు ఇచ్చామన్నారు. ఈ పట్టాలతో బ్యాంకు రుణాలు పొందడంతోపాటు క్రయ విక్రయాలు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, వైస్ ఎంపీపీ మైనం గోపి, కోఆప్షన్ సభ్యుడు, షేక్ రజాక్, సర్పంచ్ వెలగాడ కొండబాబు, జిల్లా మోనటరింగ్ కమిటీ సభ్యుడు ఎం.అప్పలరాజు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి స్కై మార్షల్ ఆర్ట్స్ పోటీలకు 30 మంది ఎంపిక


పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

రోలుగుంట: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి స్కై మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో ప్రతిభ చూపిన 30 మందిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు అసోసియేషన్ ప్రెసిడెంట్ వనం సన్యాసిరావు తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో అండర్-11, అండర్-14, అండర్-18 విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో బి.బి.పట్నం, కొమరవోలు, బుచ్చింపేట, రోలుగుంట మండలాల నుంచి 100 మంది పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ చూపిన 30 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ పోటీలను ఇన్‌చార్జి హెచ్‌ఎం శర్మ, టీచర్ కిరణ్ ప్రారంభించారు. ఈనెల 24,25 తేదీల్లో చిత్తూరులోని టీటీడీ కల్యాణమండలంలో రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయి. రోలుగుంటలలో జరిగిన ఎంపిక పోటీల్లో వ్యాయామ ఉపాధ్యాయులు కె.సావిత్రి(బి.బి.పట్నం) ఎల్.రాజులమ్మ(కొమరవోలు) బి.కొండలరరావు(బుచ్చింపేట) ఎస్.గోవింద(రోలుగుంట) పాల్గొన్నారు.

దేదీప్యమానం.. దీపోత్సవం


చోడవరం స్వయంభూ గౌరీశ్వరస్వామి ఆలయం వద్ద వెలిగించిన 40వేల దీపాలు

చోడవరం: శివనామస్మరణతో చోడవరం స్వయంభూ శ్రీ గౌరీశ్వరస్వామి ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక వెలుగులతో ప్రకాశించింది. వందకాదు వెయ్యి కాదు ఏకంగా 40వేల దీపాలతో శివాలయ ప్రాంగణంలో భక్తులు దీపోత్సవం నిర్వహించారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో అతిప్రాచీన దేవాలయాల్లో ఒకటైన చోడవరం శ్రీ స్వయంభూ గౌరీశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో పవిత్ర కార్తీకమాసం, మార్గశిరమాసాలను పురస్కరించుకుని 40వేల దీపాలతో శుక్రవారం రాత్రి నిర్వహించిన దీపోత్సవం కన్నుల పండువగా జరిగింది. శివ,అయ్యప్పస్వామి మాలధారణ భక్తులతోపాటు సాధారణ భక్తులు ఈ దీపోత్సవంలో వందలాదిగా పాల్గొన్నారు. హరహర మహాదేవ శంభో శంకర అంటూ భక్తులంతా ముక్తకంఠంతో మహాశివుని స్మరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కొడమంచిలి చలపతిరావు, వేదపండితుల ఆధ్వర్యంలో వేదమంత్రాల మధ్య మహాలింగ సహిత ద్వాదశ జ్యోతిర్లింగ దీపోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లింగాకారం, నందీశ్వరుడు, త్రిశూలం, ఓంకారం, స్వస్తిక్, శ్రీ చక్రం ఆకారాలలో దీపాలను వెలిగించారు. ఆలయ రాజగోపురాలు, సుబ్రహ్మణ్యస్వామి, ఆంజనేయస్వామి ఆలయాలను దీపాలతో అలంకరించారు. వేలాది దీపాలు ఒకే సారి వెలగడంతో ఆ ప్రాంతమంతా దేదీప్యమానంగా ప్రకాశించింది.

చిన్నాపెద్దా తేడాలేకుండా అందరూ పెద్దసంఖ్యలో పాల్గొని దీపోత్సవాన్ని కనులారా తిలకించి పరవశించిపోయారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పప్పల జయదేవ్, దేవదాయశాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి, ఆలయ కమిటీ చైర్మన్‌గూనూరు సత్తిబాబు, ఉప సర్పంచ్ పుల్లేటి వెంకటరావు, ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులు మూర్తి, లక్కుందాసు కుమారి, అత్తిలి జగన్, బ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షుడు వద్దాది నర్సింహమూర్తి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి సత్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, వైఎస్సార్‌సీపీ నాయకులు శరగడం చిమ్మినాయుడు, మారిశెట్టి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా హాకీ పోటీలు

నేడు ఫైనల్స్


అనంతపురం, విశాఖ జట్ల మధ్య జరుగుతున్న పోటీ

నక్కపల్లి: మండల కేంద్రం నక్కపల్లిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 19 విభాగంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు హోరా హోరీగా జరుగుతున్నాయి. 10 జిల్లాల నుంచి సుమారు 600 మంది బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. రెండవరోజు శుక్రవారం జరిగిన పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను కనబరిచారు. బాలుర విభాగంలో వైఎస్సార్ కడప-అనంతపురం జట్ల మధ్యజరిగిన పోటీల్లో కడప, చిత్తూరు- కృష్ణాజిల్లాల మధ్య జరిగిన పోటీల్లో చిత్తూరు, నెల్లూరు - ప్రకాశం జట్ల మధ్య జరిగిన పోటీలో నెల్లూరు, విశాఖపట్నం-తూర్పుగోదావరిజట్ల మధ్య జరిగిన పోటీలో విశాఖపట్నం జట్లు విజయం సాధించాయి. మొదటిసెమీఫైనల్స్‌లో విశాఖపట్నం, నెల్లూరు తలపడగా విశాఖప ట్నం జట్టు విజయం సాధించింది. కడప, విశాఖపట్నం జట్లు ఫైనల్స్‌కు చేరుకున్నాయి.

బాలికల విభాగంలో..

ప్రకాశం-గుంటూరు జట్లు తలపడగా ప్రకాశం, అనంతపురం-విశాఖపట్నం తలపడగా విశాఖ విజయం సాధించాయి. కర్నూలు-ప్రకాశం జట్లుతలపడగా డ్రాగా ముగిసింది. మొదటి క్వార్టర్ ఫైనల్స్‌లో కడప-చిత్తూరు పోటీపడగా చిత్తూరు గెలుపొందింది. సెకెండ్ క్వార్టర్‌ఫైనల్స్‌లో విశాఖపట్నం, విజయనగరం జట్ల మధ్య జరిగిన పోటీల్లో విశాఖపట్నం విజయం సాధించింది. మూడవ క్వార్టర్‌ఫైనల్స్‌లో కృష్ణా, ప్రకాశం జట్లు తలపడగా ప్రకాశం జట్టు విజయం సాధించింది. నాల్గవ క్వార్టర్ ఫైన్స్‌లో కర్నూలు, తూర్పుగోదావరిజట్ల మధ్య జరిగిన పోటీలో తూర్పుగోదావరి విజయం సాధించింది. ఫస్ట్‌సెమీఫైనల్స్‌లో చిత్తూరు, ప్రకాశం మధ్య జరిగినపోటీల్లో చిత్తూరు విజయం సాధించింది.సెకెండ్ సెమీఫైనల్స్‌లో విశాఖపట్నం, తూర్పుగోదావరి జట్ల మధ్య పోటీలు జరగ్గా విశాఖపట్నం విజయం సాధించింది. బాలికల విభాగంలో విశాఖపట్నం, చిత్తూరు జట్లు ఫైనల్స్‌కు చేరుకున్నాయి. మూడోరోజైన శనివారం ఫైనల్స్ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

క్లుప్తంగా

నేడు గౌరమ్మ ఉత్సవం

కశింకోట: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో శనివారం గౌరీపరమేశ్వరుల(గౌరమ్మ) మహోత్సవం నిర్వహించనున్నట్లు సర్పంచ్ కన్నం శ్యాంసన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు అద్దెపల్లి శ్రీను శుక్రవారం తెలిపారు. ఉత్సవంలో భాగంగా మధ్యాహ్నం 2 గంటలకు గుర్రపు పరుగు పందేలు నిర్వహించి, నగదు బహుమతులు అందించనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం తీన్‌మార్, మహిళల కోలాటాలతో గౌరమ్మ సారె ఊరేగింపు జరగనుందన్నారు. విశాఖ థ్రిల్లర్, సాయి ఏబీసీడీ ఈవెంట్స్ డాన్స్ బేబీ డాన్స్ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

బోయగూడెం సమస్యలపై రత్నాకర్ ఆరా



అధికారులతో మాట్లాడుతున్న రత్నాకర్

అనకాపల్లి: పట్టణంలో బోయగూడెం ప్రాంతాన్ని శుక్రవారం వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ పరిశీలించారు. గూడెం ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అక్కడ డ్రైనేజీ, తాగునీటి సరఫరాపై జీవీఎంసీ అధికారులను ఆరా తీశారు. ఆయన వెంటన వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.


భగవద్గీత కంఠస్థ పోటీలు నేడు

కశింకోట: కశింకోటలోని విజ్ఞాన దుర్గా స్కూల్లో శనివారం ఉదయం 9 గంటలకు విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో భగవద్గీత 10వ అధ్యాయం కంఠస్థ పోటీలు నిర్వహించనున్నట్లు పరిషత్ ప్రధాన కార్యదర్శి వై.ఎ.రాజు తెలిపారు. ఎల్‌కేజీ నుంచి టెన్త్ వరకు చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు.

పంట నష్టంపై సత్వర చర్యలు తీసుకోండి

తుమ్మపాల: మిచాంగ్ తుపాను ప్రభావంతో పంట నష్టపోయిన రైతుల్ని ఆదుకోవాలన్న సీఎం జగన్ ఆదేశాల మేరకు అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సూరిశెట్టి రమణ అప్పారావు శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. అనకాపల్లి సౌత్-1, సౌత్-2 ప్రాంతాల్లోని సుమారు 1600 ఎకరాల్లో కోతకొచ్చిన వరి పంట పూర్తిగా నీట మునిగిపోయిందని, దీంతో రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని విచారం వ్యక్తం చేశారు. వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి నష్టపోయిన పంటల వివరాలను క్షుణ్ణంగా నమోదు చేయాలన్నారు. సంక్రాంతిలోగా పరిహారం అందించేలా నివేదికలు త్వరితగతిన సిద్ధం చేయాలని కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 1,336 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,550	4,690
మొదటి రకం	4,200	4,620
రెండో రకం	3,940	4,330
మూడో రకం	3,870	3,960

అనకాపల్లి సినిమాలు

జోరుగా హుషారుగా: రాజా	
ఎక్స్‌ట్రా	: సత్యనారాయణస్క్రీన్-1
-------	: సత్యనారాయణస్క్రీన్-2
యానిమల్	: షిర్డిసాయి
హాయ్ నాన్న	: పర్తిసాయి
మంగళవారం	: వెంకటేశ్వర
తికమక తాండ	: శ్రీసత్య
పిండం	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 14 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-4 యూనిట్లు, బీ పాజిటివ్-3 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-5 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నిషియన్ యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 397 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 335 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

హామీలు టీడీపీవి.. ఆచరణ వైఎస్సార్‌సీపీది

బూటకపు హామీలతో ప్రజల్ని మభ్య పెట్టడం టీడీపీకి మేనిఫెస్టోతో పెట్టిన విద్య. అసత్యపు హామీలకు విస్తృత ప్రచారం చేయడం, తిమ్మిని బమ్మిని చేయాలనుకోవడం పచ్చ పత్రికల నైజం. భవిష్యత్ నేతగా విపరీత ప్రచారం చేస్తున్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ పాదయాత్ర నియోజకవర్గంలో నేడు ప్రవేశించనుంది. ఈ సందర్భంగా గత టీడీపీ పాలనలో నియోజకవర్గానికి గుప్పించిన అమలుకాని హామీలను, వాటితోపాటు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్న చర్యలను ఓసారి గుర్తు చేసుకుందాం.

- టీడీపీ పాలనలో హామీలు, శిలాఫలకాలకే పరిమితమైన అభివృద్ధి
- వైఎస్సార్‌సీపీ పాలనలో రూ.2 వేల కోట్లతో నియోజకవర్గం అభివృద్ధి

అనకాపల్లి: టీడీపీ హయాంలో అనకాపల్లి నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనుల శిలాపలకాలకే పరిమితమైంది. అబద్ధపు హామీలతో 2014 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం ఐదేళ్లలో అనకాపల్లి ప్రజలకు చేసిన అభివృద్ధి అరకొరే. అప్పటి టీడీపీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ భూకబ్జాలతో దోచుకున్నంత కూడా తమ నియోజకవర్గ అభివృద్ధికి ఖర్చుపెట్టలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

టీడీపీ నెరవేర్చని హామీలు

- కశింకోట మండలం తాళ్లపాలెంలో రూ.25 లక్షలతో కాపు సంక్షేమ భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దాన్ని పూర్తిచేయకుండా వదిలేశారు.
- కశింకోటలో రూ.25 లక్షలతో స్త్రీ శక్తి భవనం నిర్మాణానికి శంకుస్థాపనతో సరిపెట్టారు.
- కశింకోట గవరవీధిలో శారదానదిపై వంతెన నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ హామీ ఇచ్చారు. అమలుకు నోచుకోలేదు.
- భారీగా గోతులు పడిన వెదురుపర్తి-కశింకోట రోడ్డు పునరుద్ధరణకు గత ఎమ్మెల్యే పీలా ఇచ్చిన హామీ నెరవేరలేదు.
- అనకాపల్లిలోని కొత్తపల్లి బుచ్చెయ్యపేట నుంచి రావికమతం మండలం బంగారుమెట్ట రహదారి అభివృద్ధికి టీడీపీ వేసిన శిలాఫలకాలు దిష్టిబొమ్మలుగా మారాయి.
- మారేడుపూడి కూడలి నుంచి అక్కిరెడ్డిపాలెం జాతీయ రహదారి వరకు రోడ్డు పునరుద్ధరణకు శిలాపలకం ఆవిష్కరించి, సరిపెట్టారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో నెరవేరిన టీడీపీ హామీలు

- గవరవీధిలో శారదానదిపై వంతెన పనుల్ని ప్రస్తుత ప్రభుత్వం రూ.80 లక్షలతో ప్రారంభించింది. కరోనా, నదిలో వరద నీటి కారణంగా పనులకు ఆటంకం ఏర్పడింది.
- భారీగా గోతులు పడిన వెదురుపర్తి-కశింకోట రోడ్డు పునరుద్ధరణ పనులను మంత్రి అమర్‌నాథ్ చొరవతో ఏడాది క్రితం పూర్తి చేశారు.
- నర్సింగబిల్లి నుంచి కొండకర్లవైపు వెళ్లే రోడ్డుని రూ.1 కోటి 65 లక్షలతో అభివృద్ధి, కన్నూరుపాలెంలో చెరువును పార్కుగా అభివృద్ధి. మండలంలో 49 ప్రభుత్వ పాఠశాలలను రూ.8 కోట్లతోమౌలిక సదుపాయలు కల్పించి అభివృద్ధి చేశారు.
- కొత్తపల్లి బుచ్చెయ్యపేట, రావికమతం బంగారు మెట్ట రహదారిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రూ.32 కోట్లతో అభివృద్ధి చేశారు. ఈ రహదారి మీదుగానే కుంచంగి, కూండ్రం, రాజాం, రావికమతం, బుచ్చెయ్యపేట మండలాల ప్రజలకు రహదారి సౌకర్యం అందుబాటులోకి తీసుకొచ్చింది.
- రూ.2 కోట్లు వెచ్చించి మారేడుపూడి కూడలి నుంచి అక్కిరెడ్డిపాలెం జాతీయ రహదారి వరకు రోడ్డు పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఈ రోడ్డును అక్కిరెడ్డిపాలెం నుంచి తారకరామారావుకాలనీ, గణేష్ నగర్, శీరంశెట్టివానిపాలెం, మారేడుపూడి మీదుగా జాతీయ రహదారికి అనుసంధానించారు.



మండలంలో కొత్తగా నిర్మించిన వేటజంగాలపాలెం రహదారి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్మించిన అరుంధతీనగర్ వైఎస్సార్ యూపీహెచ్‌సీ

నాలుగున్నరేళ్లలో నియోజకవర్గంలో అభివృద్ధి

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన ఈ నాలుగున్నరేళ్లలో సుమారు రూ.2 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులు నియోజకర్గంలో జరిగాయి.

- జీవీఎంసీ జోన్ పరిధిలో రూ.100 కోట్లతో పార్కులు, డ్రైనేజీలు, శ్మశానవాటికలు, రహదారులు, విద్యుత్ లైట్లు, సచివాలయాలు, ప్రధాన రహదారులను అభివృద్ధి చేశారు.
- అనకాపల్లి మండలంలో రూ.వెయ్యి కోట్లతో ఆర్బీకే కేంద్రాలు, సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, రహదారులు, డ్రైనేజీలు, జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిలు, అంగన్‌వాడీ కేంద్రాల ఆధునికీకరణ, నాడు నేడులో స్కూళ్లు, ఆస్పత్రులను అభివృద్ధి చేశారు.
- రూ.100 కోట్లతో దాదాపు 5 వేల గృహాలను నిర్మించారు.
- రూ.34 కోట్లతో కోడూరులో ఇండస్ట్రియల్ పార్కు అభివృద్ధి
- అనకాపల్లి జాతీయ రహదారి మీదుగా పూడిమడక కూడలి నుంచి పట్టణానికి వచ్చే రోడ్డు టీడీపీ పాలనలో భారీ గోతులతో ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రూ.2 కోట్లతో ఈ రోడ్డును ఆధునికీకరించారు. మునగపాక నుంచి అనకాపల్లికి లోకేష్ పాదయాత్ర ఈ రోడ్డు మీదుగానే అనకాపల్లి పట్టణంలోకి ప్రవేశించనుండటం కొసమెరుపు.

నేటి నుంచి ధనుర్మాసోత్సవాలు



వేణుగోపాలస్వామి



ధ్యాన వేంకటేశ్వరస్వామి



వేణుగోపాలస్వామి ఆలయంలోని మహా లక్ష్మీదేవి

కశింకోట: దేవదాయ శాఖకు చెందిన స్థానిక పురాతన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం నుంచి ధనుర్మాసోత్సవాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు శుక్రవారం తెలిపారు. సంక్రాంతి వరకు జరిగే ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు రాత్రి సంప్రదాయంగా నెల గంట కార్యక్రమం నిర్వహించి, ప్రత్యేక పూజలు జరపనున్నట్లు పేర్కొన్నారు. రోజూ వేకువజామున విష్ణు సహస్రనామ అర్చన, తిరుప్పావై పారాయణం, పాశుర విన్నపం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ నెల 23న ముక్కోటి ఏకాదశి సందర్భంగా వైకుంఠ ద్వార(ఉత్తర గోపుర) దర్శనం, జనవరి 11న కూడారై ఉత్సవం, 14న(భోగి) గోదాదేవి కల్యాణోత్సవం జరిపించనున్నట్లు తెలిపారు.

ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా ధనుర్మాసోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు రేజేటి శ్రీరామచరణాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వారిని దశావతారాల్లో మూడు రోజులకో అవతారంఠ స్వామిని అలంకరించి ప్రత్యేక పూజలు జరపనున్నట్లు పేర్కొన్నారు.

రోజూ ఉదయం 4.30 గంటలకు సుప్రభాత సేవ, 5 గంటలకు అర్చన, 6 గంటలకు నీరాజన మంత్ర పుష్పం, శాత్తుమురై విన్నపం, మంగళధ్వని, తీర్థ కైంకర్యాలు, తిరుప్పావై పారాయణం, విష్ణు సహస్ర నామార్చన, మంగళా శాసనం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఉత్సవాల్లో భాగంగా వైకుంఠ ద్వార దర్శనం, కూడారై, గోదాదేవి కల్యాణోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 23న సాయంత్రం 6 గంటలకు రేడియో, టీవీ గాయని జొన్నలగడ్డ వల్లీ శ్రీవిద్యతో సంకీర్తన విభావరి, 30న వసంతాభిషేకం, సంకీర్తన గానామృతం, వచ్చే నెల 6న సహస్ర దీపాలంకరణ సేవ, గౌరీ అమృత వర్షిణి బృందంతో కోలాటాలు, 13న కశింకోటకు చెందిన సీతారామాంజనేయ బృందంతో కోలాటాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.



కశింకోట వేణుగోపాలస్వామి ఆలయం

సీఎం జగన్‌తోనే మారుమూల గ్రామాల అభివృద్ధి



కొప్పాక 24 సచివాలయంలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న జానకీరామరాజు చిత్రంలో మురళీకృష్ణ, జాజుల రమేష్



తుమ్మపాల-3 సచివాలయంలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న దిలీప్‌కుమార్ చిత్రంలో గొర్లి సూరిబాబు



నూతలగుంటపాలెం సచివాలయంలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ కలగా లక్ష్మి

- 'వై ఏపీ నీడ్స్ జగన్'కార్యక్రమంలో పార్టీ నేతలు

అనకాపల్లి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మారుమూల గ్రామాలు సైతం అభివృద్ధికి నోచుకుంటున్నాయని, రానున్న ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగన్ను గెలిపించుకునే బాధ్యత మనందరిపైనా ఉందని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు అన్నారు. జీవీఎంసీ విలీనగ్రామకొప్పాక 24వ సచివాలయ పరిధిలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలో పలు రాష్ట్రాల్లో ఏపీ అభివృద్ధిపై చర్చ జరుగుతోందన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రభుత్వ కార్యకలాపాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. సచివాలయ పరిధిలో చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ వివరాలతో రూపొందించిన ఫ్లెక్సీని, ప్రధాన కూడలి వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. అక్కడే రచ్చబండ కార్యక్రమం నిర్వహించి బ్రోచర్లు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, పట్టణ సచివాలయాల కన్వీనర్ కొణతాల మురళీకృష్ణ, ఏపీడీ దొర, పార్టీ నేతలు చింతల రాము, పొలిమేర నానాజీ, ఇ.నాగార్జున, వానపల్లి పద్మ, రొంగలి రాజ్యలక్ష్మి, నాగేశ్వరరావు, బత్తిన అప్పారావు, కె.రమణ, ఎస్.సతీష్ పాల్గొన్నారు.

తుమ్మపాలలో...

రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ అన్నారు. తుమ్మపాల-3 సచివాలయం వద్ద నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో వైఎస్సార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా పేదలకు మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. తొలుత అభివృద్ధి, సంక్షేమ వివరాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. సచివాలయ పరిధిలో ప్రజలకు పార్టీ బ్రోచర్లకు అందించారు. పార్టీ జెండాను ఆవిష్కరించి పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి శివ సత్యనారాయణ జోసెఫ్, వైస్ ఎంపీపీ విల్లూరి చంద్రశేఖర్, సర్పంచ్ తట్టా పెంటయ్య నాయుడు, అన్నపూర్ణ బ్యాంకు చైర్మన్ పీడీ గాంధీ, ఎంపీటీసీలు పంచదార్ల కన్నారావు, వడ్డాది అశోక్ భారతి పాల్గొన్నారు.

కశింకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మారుమూల గ్రామాలను సైతం అభివృద్ధి చేశారని ఎంపీపీ కలగా లక్ష్మి కొనియాడారు. మండలంలోని నూతలగుంటపాలెం సచివాలయంలో గురువారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. సచివాలయ పరిధిలో నాలుగున్నరేళ్లలో చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. ఒక్కో సచివాలయ పరిధిలో రూ.20 లక్షలు కేటాయించి డ్రైనేజీలు, రోడ్లు, సామాజిక భవనాలు నిర్మించిన విషయాన్ని గుర్తుచేశారు. రాష్ట్రాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న జగన్‌ను మళ్లీ సీఎంగా గెలిపించేందుకు ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, సర్పంచ్ కలిగెట్ల రత్నం, వైస్ ఎంపీపీ నమ్మి మీనా, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కలగా సోమునాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కలిగెట్ల అప్పలసోమునాయుడు, కొప్పాక రామగణేష్, పిట్టా సన్యాసిరావు, ఇన్‌చార్జి ఈవోఆర్డీ ఎస్.రమేష్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి



మెయిన్ రోడ్డులో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దాడి రత్నాకర్



మెయిన్ రోడ్డు పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మందపాటి జానకీరామరాజు



పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దిశ స్టేషన్ ఎస్ఐ రాములమ్మ



కశింకోట మండల పరిషత్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎంపీపీ కలగా లక్ష్మి



కశింకోట పొట్టి శ్రీరాములు పార్కులో నివాళులర్పిస్తున్న వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి

అనకాపల్లి: పట్టణం, మండలంలోని పలు ప్రాంతాల్లో అమరజీవి పొట్టి శ్రీరాములు 71వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. స్థానిక మెయిన్‌రోడ్డు కన్యకాపరమేశ్వరి దేవాలయం సమీపంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, పార్టీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్, సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం, విగ్రహ వ్యవస్థాపకుడు పిరట్ల నరసింహమూర్తులు, దిశ పోలీస్ స్టేషన్ ఎస్ఐ రాములమ్మలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ స్వాంత్రోద్యమంలో మహాత్మ గాంధీచే ప్రశంసలు అందుకున్న గొప్ప వ్యక్తి శ్రీరాములని కొనియాడారు. ప్రత్యేకాంధ్ర రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన మహనీయుడన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు మాట్లాడుతూ 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్షతో ప్రాణత్యాగం చేసి, తెలుగువారి కోసం ప్రత్యేక రాష్ట్రాన్ని అదించి, మనందరి గుండెల్లో అమరజీవిగా నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో నూకాంబిక దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, పార్టీ నేతలు వేగి త్రినాథ్, ఉగ్గిన అప్పారావు, కాండ్రేగుల శ్రీనివాసరావు, కొణతాల నాయుడు, డొంక సత్తిబాబు, సిద్ధార్థ అసోసియేషన్ సభ్యులు పట్నాల కృష్ణమోహన్, బొడ్డు సోమరాజు, సూరే సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర ఆవిర్భావానికి ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడని వక్తలు శ్లాఘించారు. ఎంపీపీ కలగా లక్ష్మి, ఎంపీడీవో వీవీ రవికుమార్, మండల వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, ఏవో ఎ.ఎ.ఖాన్, ఎంఈవో మూర్తి, హౌసింగ్ ఏఈ ఎస్.శ్రీనివాసరావు, ఆర్‌ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, మండల పరిషత్, సచివాలయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

- స్థానిక పొట్టి శ్రీరాములు పార్కు వద్ద శ్రీరాములు విగ్రహానికి వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ మంత్రి జయరజని తదితరులు పాల్గొన్నారు.

నేడు దివ్యాంగులకు సహాయ పరికరాల పంపిణీ



పరికరాలను పరిశీలిస్తున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లి: జిల్లాలో దివ్యాంగులకు స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంలో శనివారం ఉదయం 10 గంటలకు సహాయ పరికరాలను అందజేనున్నట్లు ఎంపీ బీవీ సత్యవతి తెలిపారు. శుక్రవారం క్రీడామైదానంలో పరికరాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి కేంద్ర సామాజిక, న్యాయ, విభిన్న ప్రతిభావంతుల శాఖ మంత్రి కె.నారాయణస్వామి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో 1,343 మంది దివ్యాంగులకు వివిధ రకాలైన 3,048 పరికరాలను అందించనున్నట్లు వెల్లడించారు. ఎంపీ వెంట దివ్యాంగుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి జగదీష్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ పాల్గొన్నారు.


వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో సృజనకు పదును



సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న సత్యవతి, సూరిబాబు

అనకాపల్లి: విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యాలను వెలికితీసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ బీవీ సత్యవతి, ఎంపీపీ గొర్లి సూరిబాబులు అన్నారు. స్థానిక వేల్పులవీధి జీవీఎంసీ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన(సైన్స్ ఎగ్జిబిషన్)ను ప్రారంభించి మాట్లాడారు. చిన్న వయసులోనే ఇలాంటి సృజనాత్మక కార్యక్రమాలతో విద్యార్థుల్లో ఆలోచనా శక్తి పెరుగుతుందన్నారు. ఈ నెల 19న జిల్లాస్థాయి పోటీలు జీవీఎంసీ పెదహైస్కూల్లో జరుగుతాయన్నారు. 28 ప్రాజెక్టుల్లో మూడు ప్రాజెక్టులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు కె.చిట్టిబాబు, కె.కోటేశ్వరరావు, ఎగ్జిబిషన్ మండల నోడల్ అధికారి కృష్ణారావు, మండల సైన్స్‌కో ఆర్డినేటర్ బీవీకె.గోవిందరావు, ఎంపీడీవో నర్సింహారావు, హెచ్‌ఎం రుధిరారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనసాగిన అంగన్‌వాడీల నిరసన



నిరసనకు మద్దతు తెలుపుతున్న కోన లక్ష్మణ

కశింకోట: కశింకోటలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన సమ్మె శుక్రవారం కూడా కొనసాగించారు. ఈ సందర్భంగా స్థానిక పోలీసు స్టేషన్ రోడ్డులో శిబిరాన్ని ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. ఏఐటీయూసీ ఉమ్మడి విశాఖ జిల్లా కార్యదర్శి కోన లక్ష్మణ శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సమస్యలపై కేబినెట్‌లో చర్చించాలని, ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నాయకులు వాయిబోయిన శేఖర్, ఆడారి వెంకటరమణ, బంగారి రవికుమార్, సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, ఐద్వా నాయకురాలు డి.డి. వరలక్ష్మి పాల్గొన్నారు.

28న పట్టణానికి బాలరాముని విగ్రహ ఊరేగింపు

తుమ్మపాల: మన రాష్ట్రం నుంచి అయోధ్యకు వెళ్తున్న బాలరాముని విగ్రహ ఊరేగింపు ఈ నెల 28న పట్టణానికి చేరుకోనుందని సోహం ఆశ్రమ కార్యదర్శి కె.రవి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బట్లపూడిలోని సోహం అశ్రమంలో రాత్రికి బస చేసి 29న గాజువాక మీదుగా విశాఖపట్నానికి బయలుదేరుతుందన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

తుమ్మపాల: ఆశా వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేసి, పని ఒత్తిడి తగ్గించాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. సమస్యల పరిష్కారంపై డీఆర్వో బి.దయానిధి, డీఎంహెచ్‌వో హెమంత్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగేశ్వ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, నాయకులు వీవీ శ్రీనివాసరావు, సీహెచ్ శివాజీ, సోమనాయుడు, ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా ప్రతినిధులు ఎస్.శాంతి, ఇ.పార్వతి, సూర్యకళ, వి.సత్యవతి, బి.రామలక్ష్మి, కె.వరలక్ష్మి, రమణమ్మ పాల్గొన్నారు.